క్లుప్తంగా

చిన్నారులతో ఎమ్మెల్యే మాటామంతీ..



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూ, కుశల ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యాబోధన, పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం పలువురు చిన్నారులు పాటలు పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణి, పతివాడ అప్పలనాయుడు, సర్పంచ్ శ్రీరామ్మూర్తి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, కార్యకర్తలు శకుంతల, చిన్నమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

మండల కో ఆర్డినేటర్‌కు అభినందనలు

భోగాపురం: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు మండల కోఆర్డినేటర్‌గా (జేసీఎస్ కన్వీనర్) నియమితులై బాధ్యతలు చేపట్టిన బైరెడ్డి ఎర్రప్పలనారాయణను దల్లిపేట సచివాలయ కన్వీనర్ దల్లి శ్రీనివాసరావు గురువారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రాజు, దల్లిపేట పంచాయతీ గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

విజయనగరం: ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు వివిధ చోట్ల ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలలో కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేపడతారని పేర్కొన్నారు. 19, 21వ తేదీలలో బీపీఎం హైస్కూల్, గురజాడ పబ్లిక్ స్కూల్, కంటోన్మెంట్ హైస్కూళ్లలో.. 23, 24 తేదీలలో కస్పా హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ వీటీ అగ్రహారం, జిల్లా పరిషత్ హైస్కూల్ గాజులరేగలలో ఆధార్ నమోదు మొబైల్ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు గమనించి ఆయా కేంద్రాలకు చేరుకుని ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ

విజయనగరం గంటస్తంభం: మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పెద్దలు దృష్టికి తీసుకెళ్లాలని విజయనగరం జిల్లా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బోగి శ్రీను మాదిగ, తదితరులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా నాయకులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాలి రమణ, రవి మాదిగ, అప్పారావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్: సినీ నటుడు చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య విజయోత్సవ సంబరాలను స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అలాగే వరుణ్‌తేజ్ జన్మదిన వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రాంకీ, నానాజీ, శ్రీను, మురళి, చక్రవర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మారూఫ్

తుని: సంక్రాంతి పండగకు సొంత ఊరికి వచ్చిన ఆయన.. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి తిరుగు ప్రయాణంలో వెళుతూ రైలు నుంచి జారిపడి మృత్యువాత పడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి తుని జీఆర్పీ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా జొన్నగడ్డ గుడ్డి గ్రామానికి చెందిన కె.కోటేశ్వరరావు(46) కాకినాడ జిల్లా గొల్లప్రోలు–పిఠాపురం రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన చిత్తూరు జిల్లా పాకాల కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సంక్రాంతి పండగకు సొంత ఊరికి వచ్చి భార్యాపిల్లలతో ఉండి డ్యూటీలో చేరడానికి రైలులో వెళుతుండగా ప్రమాదవ శాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతుడి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియపరిచి, కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

- నెల్లిమర్ల సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు
- అందుబాటులో అధునాతన పరికరాలు
- ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలతో వ్యాధుల గుర్తింపు



నెల్లిమర్ల సీహెచ్‌సీ

నెల్లిమర్ల: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని నిజం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తోంది. ఇప్పటికే పీహెచ్‌సీలను బలోపేతం చేసిన ప్రభుత్వం తాజాగా ఫ్యామిలీ డాక్టర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అదేబాటలో సామాజిక ఆరోగ్య కేంద్రాలను (సీహెచ్‌సీ) సైతం అభివృద్ధి చేస్తోంది. ఆస్పత్రులకు అవసరమైన భవనాలను నిర్మించడమే గాకుండా రోగులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రంలోని సీహెచ్‌సీకి సుమారు రూ. 3 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తోంది. రోగులకు అవసరమైన అన్నిరకాల సేవలను ఇక్కడ విస్తరిస్తోంది. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది రోగులు వస్తుంటారు. నెలకు సరాసరిన 30 వరకు ప్రసవాలు ఇక్కడ జరుగుతాయి. అలాగే సిజేరియన్, హైడ్రోసెల్, మూలవ్యాధి, తదితర శస్త్రచికిత్సలను కూడా ఈ ఆస్పత్రిలో నిర్వహిస్తారు. ప్రస్తుతం ఇక్కడ ఏడుగురు వైద్యాధికారులు సేవలందిస్తున్నారు. పీడియాట్రిక్, గైనిక్, సర్జన్, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, ఎనస్తీషియా, డెంటల్, తదితర విభాగాల్లో రోగులకు సేవలందుతున్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ, నెల్లిమర్ల, గుర్ల, విజయనగరం మండలాలకు చెందిన ప్రజలు వివిధ రకాల చికిత్సల నిమిత్తం ఈ ఆస్పత్రికి ఎక్కువగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో వైద్యసేవలను మరింత విస్తృతం చేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులోభాగంగా ఆస్పత్రిలో ఈసీజీ ప్లాంట్‌ను తాజాగా ఏర్పాటు చేసింది. అలాగే రోగులకు అవసరమైన ఎక్స్‌రే ప్లాంట్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది.

సెంట్రల్ ఆక్సిజన్

ఆస్పత్రిలో సెంట్రల్ ఆక్సిజన్ అందుబాటులోకి వచ్చింది. దీని కోసం ఇక్కడే ట్యాంక్ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న 30 బెడ్‌లకు ఆక్సిజన్ సదుపాయం కల్పించారు. దీంతో అత్యవసరంగా ఆక్సిజన్ అవసరమైన రోగులను జిల్లా కేంద్రాస్పత్రికి పంపించే అవసరం తప్పింది. ఇక్కడి ల్యాబ్‌లో కొత్తగా ఎలక్ట్రోలైట్స్, అన్నిరకాల యూరిన్ టెస్టులు నిర్వహించడానికి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులోకి వచ్చింది.

ఫిజియోథెరపీ సేవలు..

సీహెచ్‌సీలో ఇటీవల ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనికోసం అవసరమైన ఫిజియోథెరపిస్ట్‌ను ప్రభుత్వం నియమించింది. అలాగే సేవల కోసం అవసరమైన బెడ్‌లు, ఇతర పరికరాలను సరఫరా చేసింది. గతంలో ఫిజియోథెరపీ అవసరమైన రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ఇదిలా ఉంటే సీహెచ్‌సీలో మార్చురీ అందుబాటులోకి రానుంది. దీని కోసం ఈ ప్రాంగణంలో ప్రత్యేకంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు అవసరమైన వెంటిలేటర్లు కూడా ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్నారు.



చిన్నపిల్లలకు ఉపయోగపడే వెంటిలేటర్లు

అందుబాటులోకి జనరేటర్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా రోగులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అత్యాధునిక జనరేటర్ సరఫరా చేసింది. గతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు వార్డుల్లోని రోగులు బితుకుబితుకుమంటూ గడిపేవారు. అలాగే సర్జరీలకు కూడా అంతరాయం ఏర్పడేది. ఇదిలా ఉంటే ఆస్పత్రికి అవసరమైన భవనాల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. సుమారు రూ. 3 కోట్లతో నూతన భవనాలను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం పూర్తయితే సీహెచ్‌సీ పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.



ఎక్స్‌రే, రక్త పరీక్షల పరికరాలు



జనరేటర్

సేవలు వినియోగించుకోవాలి

సీహెచ్‌సీలో రోగులకు అవసరమైన సేవలన్నీ అందిస్తున్నాం. ఈసీజీ, ఎక్స్‌రే ప్లాంట్‌లు అందుబాటులోకి వచ్చాయి. అన్నిరకాల రక్త, యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నాం. రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జనరేటర్ అందుబాటులోకి వచ్చింది. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి.

– కె. శ్రీనివాసరావు,
డిప్యూటీ సివిల్ సర్జన్, సీహెచ్‌సీ

పనితీరు చూసి ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపని తీరును చూసి మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. మండలంలోని పేరాపురంలో గడప డపకు మన భుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్యెలే, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల కాలంలో ప్రభుత్వం పనితీరును వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశం మొత్తం గుర్తించే విధంగా జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ , అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం ఇప్పటికే అమలు చేశామని చెప్పారు. కులం, మతం, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, అర్హత ఉంటే పథకాలు ఇంటి ముంగిటకే వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, రౌతు శ్రీరామ్మూర్తి, పైడి సుజాత, పిన్నింటి ఎల్లంనాయుడు, ఎడ్ల రామకృష్ణ, బర్రి చినఅప్పన్న, మొంగం నాగబాబు, కోరాడ మహేష్, జనపాల అప్పారావు, పి. అప్పడుదొర, డి. ఈశ్వరరావు, దేశెట్టి గణేష్, మధుసూదనరావు, చాపల సత్తిబాబు పాల్గొన్నారు.

వేమన శతకాలు భవిష్యత్ తరాలకు దిక్సూచి..

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, తదితరులు



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: వేమన శతకాలు, ఆయన రచనలు భవిష్యత్ తరాలకు దిక్సూచి లాంటివని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో వేమన జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షానికి తడవని వారు, వేమన పద్యం వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదన్నారు. ఎంతో దూర దృష్టితో సమాజ హితాన్ని కోరే విధంగా ఆయన రచనలు ఉంటాయని చెప్పారు. అంతటి లోకకవి తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు వేమన పద్యాలు నేర్పించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ, సామాజిక స్పృహ కలిగిన కవిగా వేమన పేరుగాంచాడన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ తత్త్వవేత్త యోగి వేమన ..

విజయనగరం: యోగి వేమన భారతీయ తత్త్వవేత్త అని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని పదో డివిజన్ పరిధిలో నారాయణం ధర్మచలమయ్య మున్సిపల్ పార్కులో రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మంది నిరుపేదలకు రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగి వేమన కవితలు సరళమైన భాషలో ఉంటాయన్నారు. వేమన పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన రత్నాల హారాలని అభిప్రాయపడ్డారు. యోగి వేమన జీవితాన్ని, వేమన పద్యాలలో ఉండే నీతిని భావితరాలకు తెలియచెప్పే ప్రయత్నం చేస్తున్న రెడ్డి సంక్షేమ సేవా సంఘం కృషి ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ ఎ. గోపాలరావు మాట్లాడుతూ, వేమన కవితా ప్రాశస్త్యాన్ని వివరించారు. రెడ్డి సంక్షేమ సేవా సంఘం ప్రతినిధి నాయని మహేష్‌రెడ్డి మాట్లాడుతూ, వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ నాయని పద్మ, రెడ్డి సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు తోటన్న రెడ్డి, దారపు శ్రీనివాసరెడ్డి, బాల బ్రహ్మారెడ్డి, భవిరెడ్డి శివారెడ్డి, సరగడ సూరిబాబురెడ్డి, అచ్చిరెడ్డి, తోనంగి జగన్నాథరెడ్డి, పిలక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని నాలుగో డివిజన్ మంగళవీధి కాలనీలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమకందుతున్న పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, అవినీతిరహితంగా పాలన సాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం గొప్ప విషయమన్నారు. స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఇప్పటి వరకు సుమారు నాలుగు కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో జరిగాయన్నారు. వీధి దీపాలు, కాలువలు, రహదారులు కొన్నిచోట్ల లేకపోవడాన్ని స్థానికులు ప్రస్తావించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, కార్పొరేటర్ బండారు ఆనందరావు, వజ్రపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భూముల రీ సర్వే

నెల్లిమర్ల: గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే ప్రక్రియ చురుగ్గా చేపట్టాలని ఆర్‌డీఓ ఎం. అప్పారావు తహసీల్దార్ కేవీ రమణరాజు, ఇతర అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయిందీ, ఎంతమేర ఆన్‌లైన్ చేశారు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. యజమానులకు భూహక్కు పత్రాలు త్వరితగతిన అందించాలని ఆదేశించారు.

పూతదశలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి




అర్ధన్నపాలెం సమీపంలోని మామిడితోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

కొత్తవలస: మామిడి సాగులో పూత దశలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే పూత నిలబడుతుందని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన సహాయ సంచాలకులు శైలజ అన్నారు. మండలంలోని బలిగట్టాం, అర్ధన్నపాలెం, రాయపురాజుపేట, కంటకాపల్లి గ్రామాల్లోని మామిడి తోటలను స్థానిక ఉద్యానవన అధికా రి ఉమాభరణితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సువర్ణరేఖ, పనుకులు వంటి రకాల చెట్లకు డిసెంబర్ నెలలో పూత వస్తుందని, అయితే అకాల వర్షాలు, తీవ్ర మంచు ప్రభావంతో వీటిలో పూత మాగిపోయిందన్నారు. ఆయా రకాలకు సంబంధించిన చెట్లలో పూత 40 శాతం మాత్రమే నిలిచిందని చెప్పారు అలాగే బంగినపల్లి రకం చెట్లకు ప్రస్తుతం పూత వస్తోందని, దీన్ని తేనె మంచు పురుగు, తామర పురుగు,బూడిద తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని, సకాలంలో నివారణ చర్యలు పాటించాలని రైతులకు వివరించారు. వారి వెంట గ్రామ ఉద్యానవన సహాయకులు ప్రసాద్, రవిప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీడీఓ దాసరి బంగారయ్య



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య కోరారు. మండలంలోని రామచంద్రపేట, అమటాం రావివలస సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను ఎంపీడీఓ దాసరి బంగారయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, చిరునామాలో మార్పులు, మొబైల్ నంబర్‌ను లింక్ చేసుకునేందుకు గానూ ఈనెల 19వ తేదీన రామచంద్రపేట, అమంటాం రావివలస, నందిగాం, చాకివలస సచివాలయల్లో.. 20న బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, కొండ్రాజుపాలెం, ముక్కాం.. 21న చేపలకంచేరు, పోలిపల్లి, చెరుకుపల్లి.. 23న గూడెపువలస, దల్లిపేట, రాజాపులోవ, గుడివాడ.. 24న భోగాపురం–1, 2, ముంజేరు, కవులవాడ, తూడెం, రావాడ, సవరవిల్లి సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రామచంద్రపేట ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓ రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

విజయనగరం టౌన్: ఐఆర్‌డీఏఐ నిర్ణయాల వల్ల ఎల్ఐసీ ఉనికికి ముప్పు ఏర్పతుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎల్ఐసీ ఉద్యోగులు కోరారు. ఈమేరకు గురువారం మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, యూనిట్ కార్యదర్శి ఆర్.అప్పలనాయుడు మాట్లాడుతూ, ఐఆర్‌డీఏఐ నిర్ణయాలతో మనదేశంలో బీమా పరిశ్రమ 1956 పూర్వపు పరిస్థితులకు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల పాలసీదారుల సొమ్ముకు భద్రత కరువవుతుందన్నారు. కేవలం ఎల్ఐసీలోనే కాకుండా బాగా లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ, ప్రైవేటీకరణ వైపు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తుల క్షేమమే ప్రధానం

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మక్కువ:

శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల క్షేమమే లక్ష్యంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. శంబర గ్రామంలో సాగుతున్న జాతర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా ఆయనకు ఆలయ ఈఓ రాధాకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో వేదపండితులు ఆరవెల్లి విజయకుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చదురుగుడి వెనుక ఉన్న క్యూలైన్‌లు, పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. గోముఖినది బ్రిడ్జి రక్షణ గోడపై ఖాళీ స్థలాన్ని బారికేడ్లతో మూసివేయించాలని సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పైడిరాజును ఆదేశించారు. చదురుగుడి ముందు భాగం వైపు భక్తులు లోపలకు ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. పార్కింగ్ స్థలాలు దాటి వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్ కిరణ్, డీఎస్పీ సుభాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు పయనం

- ఈనెల 21 నుంచి తాడేపల్లిగూడేంలో జరగనున్న పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు పయనమయ్యాయి. ఈ నెల 20, 21, 22 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేంలో అండర్–14 విభాగంలో జరగనున్న బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 30 మంది క్రీడాకారుల బృందం గురువారం బయలుదేరింది. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు రాణించాలని ప్రభుత్వ సంస్కృత పాఠశాల పీడీ తాడుబాబు ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు స్కూల్‌గేమ్స్ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, ఇరుజట్ల కోచ్ అండ్ మేనేజర్లు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో జరగనున్న ఫుట్‌బాల్ పోటీలకు పయనమైన జిల్లా బాల, బాలికల జట్లు